సాక్షి
అనంతపురం

గురువారం । 2 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.25,190

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25,190 పలికాయి.



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.6°/14.1°

జిల్లా అంతటా బుధవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడుపుతా

- నూతన డీఆర్‌ఎం సీఎస్ గుప్తా



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఆర్‌ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు: అందరి సహకారంతో గుంతకల్లు రైల్వే డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని నూతన డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్‌గా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీపీఓ క్యాప్రిల్ ఆరోరా, ఇతర విభాగాల అధికారులు మర్యాద పూర్వకంగా ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాంకాక్షలు తెలిపారు. అదేవిధంగా రైల్వేకార్మిక సంఘాల నాయకులు శాలువతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా సమావేశమయ్యారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రయాణికుల భద్రతతోపాటు ప్రమాదాల నివారణకు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

దయనీయం.. దుర్భరం



చాంద్‌బాషాను మోసుకెళ్తున్న భార్య, కుమార్తె

అనంతపురం మెడికల్: అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోజు రోజుకూ పరిస్థితులు దయనీయంగా మారుతున్నాయి. రోగులకు మెరుగైన సేవలు గగనమవుతున్నాయి. నడవలేని స్థితిలో ఆస్పత్రికి వచ్చే రోగుల కోసం ఎంఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌ఓలను అందుబాటులో ఉంచి స్ట్రెచర్, వీల్‌చైర్‌పై తీసుకెళ్లాల్సి ఉంది. అయితే, రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు నిద్రమత్తులో ఉండటంతో ఎంఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌ఓలు ఎక్కడా కానరావడం లేదు. దీంతో రోగులను వారి బంధువులే అవస్థలు పడుతూ వార్డులకు తీసుకెళ్లాల్సి వస్తోంది. నడవలేని స్థితిలో ఉన్న కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన చాంద్‌బాషాను సర్వజనాస్పత్రిలో డాక్టర్లకు చూపించేందుకు కుటుంబసభ్యులు బుధవారం ఆటోలో తీసుకొచ్చారు. అయితే, ఎంఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌ఓలు పత్తా లేకపోవడంతో రోగి భార్య మహబూబ్ జాన్, కుమార్తెలు ముబీనా, సాదక్ బీలే అతడిని ఎత్తుకుని వార్డు వరకూ తీసుకెళ్లారు. ఇప్పటికైనా ఆర్‌ఎంఓలు మేలుకుని తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

రాప్తాడురూరల్: ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన అనంతపురంలో బుధవారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలానికి చెందిన విద్యార్థిని అనంతపురం శివారులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బాలికకు తల్లిదండ్రులు లేరు. ఆర్డీటీ సహకారంతో విద్యనభ్యసిస్తోంది. బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో డైనింగ్‌హాలు వద్ద ఉరి వేసుకున్న స్థితిలో కనిపించింది. సమాచారం అందుకున్న సీఐ శేఖర్ ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సర్వజనాస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యసాయి శత జయంతి వేడుకల లోగో ఆవిష్కరణ



సత్యసాయి శత జయంతి వేడుకల లోగోను ఆవిష్కరిస్తున్న ఆర్.జె.రత్నాకర్ రాజు, సభ్యులు

ప్రశాంతి నిలయం: ఈ ఏడాది నవంబర్‌లో జరిగే సత్యసాయి శతజయంతి వేడుకలకు సంబంధించి సత్యసాయి మీడియా సెంటర్ రూపొందించిన ప్రత్యేక లోగోను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు, సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, వైస్ చైర్మన్ నిమిష్ పాండ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శతజయంతి వేడుకల థీమ్ సాంగ్‌ను డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించారు.

రాయలసీమ జిల్లాల వాసులకు ఎంతో అనుకూలంగా ఉండే ‘పేదోడి రైళ్ల’ను అధికారులు రెండు నెలల పాటు రద్దు చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకనే ఉన్నట్లుండి నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో ఉద్యోగులు, సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పేదోడి రైళ్లకు బ్రేకులు

- రెండు నెలల పాటు ఆరు ప్యాసింజర్ రైళ్లు రద్దు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారుల విఫలం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న సాధారణ, మధ్య తరగతి ప్రజలు

గుంతకల్లు: అనంతపురం,శ్రీసత్యసాయి,వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల మీదుగా రాకపోకలు సాగించే ఆరు ప్యాసింజర్ రైళ్లకు బ్రేకులు పడ్డాయి. ఫిబ్రవరి 28వ తేదీ వరకు తిరుపతి-కదిరిదేవరపల్లి-తిరుపతి(57405/06),గుంతకల్లు-తిరుపతి-గుంతకల్లు (57404/03), తిరుపతి-హుబ్లీ-తిరుపతి (57401/402) ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయోగరాజ్‌లో జరిగే కుంభమేళాను పురస్కరించుకుని ఆయా ప్రాంతాలకు ఈ రైళ్లను మళ్లించారు.

ఎంతో సౌలభ్యం..

అందుబాటు ధరలో టికెట్ రేట్లు ఉండటంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ రైళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. తిరుమలకు రోజూ వందలాది మంది భక్తులు వెళ్లేవారు.గుంతకల్లు నుంచి అనంతపురం వెళ్లడానికి కేవలం రూ.20 ఖర్చు కావడంతో నిత్యం పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. ఒక్క గుంతకల్లు నుంచే అనంతపురానికి వందలాది మంది వెళ్లివచ్చేవారు. ఆర్‌టీసీ బస్సుల్లో అనంతపురానికి చార్జీ రూ.120 కావడం, ప్రయాణ సమయం కూడా తక్కువే పడుతుండటంతో చాలా మంది ఈ రైళ్ల వైపు మొగ్గు చూపేవారు. ఇక.. కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజర్‌కు రెండు స్లీపర్ బోగీలు, హుబ్లీ-తిరుపతి ప్యాసింజర్‌కు ఒక్క స్లీపర్ బోగీ ఉన్నాయి. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన చాలా మంది వీటి టికెట్లను రెండు నెలల ముందే బుక్ చేసుకొని తిరుమల దర్శనానికి ప్రణాళికలు రచించుకునేవారు. గుంతకల్లు-కల్లూరు మార్గంలోని ఇమాంపురం, చింతలంపల్లికి ఆర్టీసీ బస్సుల సౌకర్యం సరిగా లేకపోవడంతో ఆయా గ్రామస్తులకు ప్యాసింజర్ రైళ్లు చాలా అనుకూలంగా ఉండేవి. ఎంతో సౌలభ్యంగా ఉండే అలాంటి రైళ్లను ఉన్నపళంగా రద్దు చేయడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కదిరిదేవరపల్లి ప్యాసింజర్ రైలు

ఇబ్బందులు పడాలి..



నర్సింగ్ కోర్సుపై ఆరు నెలల శిక్షణకు ఇటీవలే అనంతపురం ప్రభుత్వ కళాశాలలో చేరా. గుంతకల్లు రైల్వేస్టేషన్ నుంచి రోజూ ఉదయం 6.30 గంటలకు తిరుపతి ప్యాసింజర్‌లో అనంతపురం వెళ్లి.. తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు గుంతకల్లు ప్యాసింజర్‌లో ఇంటికి చేరుకునేవాడిని. టికెట్టు కేవలం రూ.20 కావడంతో ఎంతో అనుకూలంగా ఉండేది. రైళ్ల రద్దుతో రెండు నెలల పాటు ఇబ్బందులు పడాలి.

– షర్మాస్, గుంతకల్లు

తిరుమల ఎలా వెళ్లాలో..?!



ఫిబ్రవరిలో తిరుమల వెంకన్న దర్శనం కోసం కుటుంబ సభ్యులతో వెళ్లేందుకు తిరుపతి ప్యాసింజర్‌లో టిక్కెట్లు బుక్ చేసుకున్నా. ఇప్పుడు ఉన్నట్లుండి రద్దు చేయడంతో ఎలా వెళ్లాలో అర్థం కావడం లేదు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో బుక్ చేసుకుందామంటే టికెట్ రేటు ఎక్కువ ఉండటంతో పాటు దొరకుతాయని గ్యారంటీ లేదు. బస్సులో వెళ్దామంటే ఒక్కొక్కరిపై రూ.800కు పైగా భారం మోయాలి.

– హరి, గుంతకల్లు

ఆటోలే దిక్కు..



గుంతకల్లు, అనంతపురం వెళ్లేందుకు ప్యాసింజర్ రైళ్ల మీద ఆధారపడ్డాం. మా గ్రామానికి కూత వేటు దూరంలోనే రైల్వే స్టేషన్ ఉంది.దీంతో ఉదయం,సాయంత్రం వేళల్లో గుంతకల్లుకు వెళ్లడానికి, తిరిగి రావడానికి ఎంతో అనుకూలంగా ఉండేవి. అలాంటి రైళ్లను రెండు నెలలు పాటు రద్దు చేశారని తెలిసింది. ఇప్పుడు గుంతకల్లు, అనంతపురం వెళ్లాలంటే ఆటోలే దిక్కు.

– సురేంద్ర, ఇమాంపురం, గుంతకల్లు మండలం

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్
- యాడికి కస్తూర్బా గాంధీ విద్యాలయం తనిఖీ



విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

యాడికి: విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని వేములపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి బాలికల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించేలా మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు. బాలికలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయాలన్నారు. ప్రతి అంశాన్ని వివరణాత్మకంగా బోధించాలన్నారు. క్రీడల పట్ల కూడా ఆసక్తిని పెంపొందించాలని, అప్పుడే వారు శారీరకంగా దృఢంగా ఉండగలరన్నారు. వసతుల కల్పనకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. విద్యాలయంలో డ్రైనేజీ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, కమ్యూనిటీ సోక్‌పిట్స్ కింద తీర్మానం చేసి మండల నిధుల నుంచి ఖర్చు చేయాలని, లేకుంటే ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి వర్క్ ఆర్డర్ తెప్పించుకొని వెంటనే పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్‌బాబు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబీ దేవి, తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఏఓ నాగేశ్వర రెడ్డి, యాడికి, రాయలచెరువు పీహెచ్‌సీల వైద్యులు పరమేశ్వర, దేవరాజ్, కేజీబీవీ ప్రత్యేక అధికారి నిర్మల, తాడిపత్రి సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఎంపీహెచ్ ఈఓ లక్ష్మన్న, పీహెచ్‌డబ్ల్యూ సుమతి తదితరులు పాల్గొన్నారు.

మేమింతే.. మారమంతే

- రాయలచెరువులో ఆగని మట్టి దందా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



రాయలచెరువు చెరువులో టిప్పర్లలోకి హిటాచీలతో మట్టి లోడింగ్ చేస్తున్న దృశ్యం



స్థానిక చందన గేట్ గుండా మితిమీరిన వేగంతో వెళ్తున్న మట్టి టిప్పర్

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామంలో మట్టి దందా ఆగడం లేదు. స్థానికులు అడ్డు చెప్పినా లెక్కచేయడం లేదు. టీడీపీ మాజీ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో గ్రామ చెరువు నుంచి నిత్యం వందల టిప్పర్ల చెరువు మట్టి తరలిస్తున్నారు. భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. పత్రికల్లో కథనాలు వస్తే ఒకటి రెండు రోజులు ఇరిగేషన్ అధికారులు హడావుడి చేసి ఆ తర్వాత షరా ‘మామూలు’గా మిన్నకుంటున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

50 ఎకరాల్లో ఊడ్చేశారు..

మట్టి దొంగల కారణంగా రాయలచెరువు చెరువు కళావిహీనంగా తయారవుతోంది. గత రెండు నెలల్లోనే చెరువులో దాదాపు 50 ఎకరాల్లో మట్టిని తవ్వేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రాయలచెరువు పరిసర ప్రాంతాల్లోని పొలాలకైతే టిప్పర్‌కు రూ.3 వేల ప్రకారం, వేరే మండలాలకు దూరాన్ని బట్టి అదనంగా వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. చెరువు మట్టిని అధికారుల అనుమతితో రైతులు ఉచితంగా తరలించుకునే వెసులుబాటు ఉంది. అయితే, టీడీపీ నాయకులు మాత్రం రైతులను చెరువు దరిదాపులకు కూడా రానివ్వకుండా తాము నిర్ణయించిన ధరలోనే తోలుకోవాలని తేల్చి చెబుతున్నారు.

టిప్పర్ డ్రైవర్లతో హడల్..

మట్టి టిప్పర్లు రాయలచెరువు చెరువు నుంచి కూర్మాజిపేట మీదుగా రాయలచెరువు గ్రామంలోని నం.1 ప్రాథమిక పాఠశాల, చందన గేట్ వద్ద ఉన్న ఉన్నత పాఠశాల మీదుగా గుత్తి, డోన్ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. అధికంగా ట్రిప్పులు తోలితే ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశతో డ్రైవర్లు మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. పెద్దపెద్ద శబ్దాలతో సినిమా పాటలు పెట్టుకోవడంతో పాటు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా డ్రైవింగ్ చేస్తుండటంతో విద్యార్థులు, ప్రజలు రోడ్డును దాటాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి అడ్డు చెప్పడానికి ధైర్యం కూడా చేయడం లేదు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నా నోరు మెదపడం లేదు. దీనిపై ఇరిగేషన్ శాఖ జేఈ నూర్జహాన్ వివరణ కోరగా.. ఆమె స్పందించారు. రాయలచెరువులో చెరువు మట్టిని తవ్వేందుకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. ఇప్పటికే రెండు సార్లు వారికి చెప్పామని, దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



అనంత వెంకటరామిరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

- శ్రేణులకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ‘అనంత’ పిలుపు
- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

అనంతపురం కార్పొరేషన్: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ‘అనంత’ నివాసంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో తరలివచ్చి ‘అనంత’కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేసిన మేలును వివరించాలన్నారు. కూటమి సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. వేడుకల్లో వైఎస్సార్ సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు సాకే చంద్ర, ఓబిరెడ్డి, సైపుల్లాబేగ్, అమర్‌నాథ్ రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, నరసింహులు, శ్రీదేవి, శ్రీనివాస్‌రెడ్డి, బాకే హబీబుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు తోపుదుర్తి భాస్కర్ రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, గౌస్‌బేగ్, రాధాకృష్ణ, శోభారాణి, శోభాబాయి, భారతి, కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.



అనంతపురంలో షిర్డీ సాయినాథున్ని దర్శించుకుంటున్న భక్తులు



కంబదూరులోని చర్చిలో ప్రత్యేక పార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

నూతన సందడి

ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆలయాలు, చర్చిలకు పోటెత్తారు. తాము అనుకున్నవి నెరవేర్చాలని దేవుళ్లను మొక్కుకున్నారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని పార్కుల్లో సందడి నెలకొంది. పిల్లలు, పెద్దలు ఆనందంగా కాలక్షేపం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం/ఆత్మకూరు



పంపనూరు సిటీ పార్కు వద్ద పర్యాటకుల సందడి

క్లుప్తంగా

ప్రైవేట్ క్లినిక్ సీజ్



క్లినిక్‌ను సీజ్ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి

పామిడి: నిబంధనలు అతిక్రమించి నిర్వహిస్తున్న పామిడిలోని ఎద్దులపల్లి రోడ్డులో ఉన్న ఆరోగ్య క్లినిక్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి మంగళవారం రాత్రి సీజ్ చేశారు. క్లినిక్ నిర్వహణకు అనుమతి పొందిన డాక్టర్ ఆనందకుమార్.. ఎలాంటి అనుమతులు లేకుండా రోగులను అడ్మిషన్ చేసుకుని ప్రైవేట్ ఆస్పత్రిగా మార్చిన తీరుపై ఇటీవల ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనికి తోడు డాక్టర్ ఆనంద్ అందుబాటులో లేని సమయంలో సిబ్బంది చికిత్స అందజేస్తున్నారు. దీంతో అందిన ఫిర్యాదుల మేరకు మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేపట్టిన డీఎంహెచ్‌ఓ ఈబీదేవి.... నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రిని నిర్వహిస్తున్నట్లుగా నిర్ధారించుకుని సీజ్ చేశారు.

తాడిపత్రిలో చైన్‌స్నాచింగ్



ఘటనపై బాధితురాలిని ఆరా తీస్తున్న పోలీసులు

తాడిపత్రి టౌన్: నూతన సంవత్సర వేడుకలకు ఇంటిని ముస్తాబు చేస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు లాక్కొని ఉడాయించాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని గాజుల క్రిష్టప్ప వీధిలో నివాసముంటున్న ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి మంగళవారం రాత్రి ఇంటి ముందు శుభ్రం చేసి ముగ్గు వేస్తుండగా ఓ యువకుడు అక్కడకు చేరుకుని ఆమె మెడలోని 4 తులాల బంగారు గొలుసు లాక్కొని ఉడాయించాడు. ఆ సమయంలో ఆమె కేకలు వేసినా.. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ గౌస్‌బాషా.. సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

అక్షరం మార్చి... సరఫరా ధర పెంపు

- పుస్తక ప్రియుల నెత్తిన ధరల పిడుగు
- బుక్ పోస్ట్ సర్వీసు పేరు మార్చి సేవల ధర భారీగా పెంపు
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

అనంతపురం సిటీ: చిన్నపాటి అక్షరాన్ని మార్చి... సరఫరా ధరను భారీగా పెంచిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పుస్తక ప్రియుల పాలిట శరాఘాతమైంది. తపాలాశాఖకు చెందిన 'బుక్ పోస్ట్' సర్వీసును 'బుక్ పోస్టు'గా పేరు మార్చిన మోదీ సర్కార్ ధరల మోత మోగించింది. ఉత్తరాలు, మనీయార్డర్ల బట్వాడా నుంచి బ్యాంకింగ్ సేవల వరకు దశలవారీగా విస్తరిస్తూ వచ్చిన తపాలా శాఖ.. తాజాగా పుస్తక ప్రియులకు భారీగా షాక్ ఇచ్చింది. ఇంత కాలం బుక్ పోస్ట్ సర్వీసు పేరుతో అతి తక్కువ ధరకే కోరుకున్న పుస్తకాన్ని పాఠకుడికి అందజేసేవారు. తాజాగా మూడు రకాల బుక్‌పోస్ట్ సేవలను ఒకే విభాగం కిందకు తెస్తూ రిజిస్టర్ ప్రింటెడ్ బుక్ పోస్ట్‌ను 'బుక్ పోస్టు'గా మార్చి భారీగా సేవల చార్జీ పెంచారు. ఈ క్రమంలోనే నాలుగు రకాలుగా ఉన్న పోస్ట్‌కార్డులను కూడా ఒకే విభాగం కిందకు తెచ్చారు. రిజిస్టర్ బుక్ పోస్ట్ కాలమ్‌ను గత ఏడాది డిసెంబర్ 18 నుంచి ఏకంగా సాఫ్ట్‌వేర్ నుంచి రహస్యంగా తొలగించడం తపాలా ఉద్యోగులతో పాటు అందరినీ షాక్‌కు గురి చేసింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పుస్తకాలతో పాటు దిన, వార, పక్ష పత్రికల బట్వాడాపై తీవ్ర ప్రభావం చూపనుంది.



కొరియర్ సేవలతో పోలిస్తే..

ప్రైవేటు కొరియర్ సర్వీసులతో పోల్చుకుంటే ఇప్పటి వరకూ తపాలా శాఖ చాలా తక్కువ ధరలతో వస్తు తరలింపు సేవలు అందిస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కఠిన నిర్ణయాలతో ప్రైవేటు కొరియర్ సేవలే మేలనే పరిస్థితి వచ్చిందని వినియోగదారులు అంటున్నారు. తాము ఫోన్ చేస్తే చాలు పబ్లిషర్లు ఇంటికే పుస్తకాలు పంపుతున్నారని గుర్తు చేసుకుంటున్నారు. దేశంలో ఏ మారుమూల ప్రాంతం నుంచైనా పుస్తకాలు, వార, పక్ష పత్రికలు తెప్పించుకోవాలంటే ఐదు కిలోల బరువున్న పార్శిల్‌కు గతంలో రూ.80 చెల్లించేవారమని, ఇప్పుడు అదే బరువు కలిగిన పార్శిల్‌కు రూ.365 చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ప్రచురణ రంగంలో ప్రకంపనలు..

కేంద్రం నిర్ణయం ప్రచురణ రంగంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. రిజిస్టర్ బుక్ పోస్టు ద్వారా 200 పేజీల పుస్తకాన్ని జీఎస్టీతో కలిపి రూ.25కు పంపేవారు. ఇప్పుడు ఆ సర్వీసును తపాల శాఖ రద్దు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పుస్తకాన్ని రిజిస్టర్డ్ పార్శిల్‌లో మాత్రమే అందుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రూ.100 విలువ చేసే పుస్తకాన్ని పాఠకుడెవరైనా పోస్టల్‌లో తెప్పించుకోవాలంటే పుస్తక వెల రూ.100తోపాటు మరో రూ.80 పోస్టల్ చార్జీల కింద భరించాల్సి ఉంటుంది. ఇంత భారం భరించి పుస్తకాలను తెప్పించుకునే వారెవరుంటారు? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

5 శాతం దిగుమతి సుంకం..

కేంద్రం తీసుకున్న మరో నిర్ణయంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శాంపిల్ పుస్తకాలపై 5 శాతం దిగుమతి సుంకం విధించడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. ప్రాంతీయ భాషలో ముద్రించిన పుస్తకాలను విదేశీ భాషల్లోకి అనువాదం చేసి ప్రచురిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో విదేశీ పబ్లిషర్లు ఆ పుస్తకాల కాంప్లిమెంటరీ కాపీలను పంపుతుంటారు. ఇలా విదేశాల నుంచి వచ్చే పుస్తకాలపై తొలిసారి కేంద్రం దిగుమతి సుంకం విధించింది. వాణిజ్య ప్రయోజనాలతో విక్రయించేందుకు ఉద్దేశించిన పుస్తకాలపై దిగుమతి సుంకం విధించడం సమర్థనీయమే అయినా.. కాంప్లిమెంటరీగా పంపే పుస్తకాలపై సుంకం పేరిట అదనపు భారం మోపడం దుర్మార్గమేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

పెరిగిన ధరలు ఇలా..

బుక్ పోస్ట్ బరువు	పాత ధర	కొత్త ధర
100 గ్రాములు	రూ.22	రూ.28
1000 గ్రాములు	రూ.27	రూ.92
2వేల గ్రాములు	రూ.43.50	రూ.163
3వేల గ్రాములు	రూ.56.40	రూ.234
4వేల గ్రాములు	రూ.67	రూ.304
5వేల గ్రాములు	రూ.79	రూ.365

పుస్తక పఠనానికి దూరం చేయడమే



కేంద్రం తీసుకున్న నిర్ణయంతో పాఠకులు పుస్తక పఠనానికి దూరమవుతారు. ఇది సరైన నిర్ణయం కాదు. మరిన్ని రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాల్సిందిపోయి.. ధరలు పెంచితే పుస్తకాలు కొనేదెవరు? తెప్పించుకునేదెవరు? చదివేదెవరు? ఇప్పటికైనా కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– కొండసాని రజిత, కవయిత్రి

బీజేపీ నేత సందిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

అనంతపురం అర్బన్: రైతులు గోదాముల్లో నిల్వ చేసుకున్న పప్పుశనగ పంటను అక్రమంగా అమ్ముకున్న బీజేపీ నేత సందిరెడ్డి నారాయణస్వామిపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ డిమాండ్ చేశారు. జిల్లా సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వజ్రకరూరు, విడపనకల్లు, ఉరవకొండ, గుంతకల్లు మండలాలకు చెందిన రైతులు గోదాములో 228 పప్పుశనగ బస్తాలను నిల్వ చేసుకున్నారని గుర్తు చేశారు. అయితే ఈ పంట దిగుబడులను రైతులకు తెలియకుండానే బీజేపీ నేత నారాయణస్వామి అక్రమంగా విక్రయించుకుని సొమ్ము చేసుకున్నారన్నారు. 1,039 క్వింటాళ్ల పప్పుశనగ అమ్ముకుని రెండేళ్లుగా డబ్బు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న నారాయణస్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీజేపీ నేత నిర్వహించే గోదాములు సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

లక్ష్మంపల్లిలో పత్తి, బైకు దగ్ధం



కాలిపోయిన పత్తి, ద్విచక్రవాహనం

పెద్దవడుగూరు: మండలంలోని లక్ష్మంపల్లిలో మంగళవారం రాత్రి 11 గంటలకు రైతు చిన్నమారెప్పకు చెందిన పత్తికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో క్వింటా పత్తితో పాటు పక్కనే ఉంచిన హుస్సేన్‌పీరా ద్విచక్ర వాహనం కాలిపోయాయి. ఘటనతో రూ.60 వేల వరకూ బాధితులు నష్టపోయారని ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా

వజ్రకరూరు: వ్యక్తి మృతికి కారణమైన వారిని అరెస్ట్ చేయడంతో పాటు తమకు న్యాయం చేకూర్చాలంటూ మృతదేహంతో బాధిత కుటుంబసభ్యులు బుధవారం వజ్రకరూరు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. వివరాలు... వజ్రకరూరు మండలం గూళ్యపాళ్యం గ్రామానికి చెందిన ఎం.సుంకన్న (52) మంగళవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన వ్యక్తితో కలసి ద్విచక్ర వాహనంపై గుంతకల్లుకు బయలుదేరాడు. కొనకొండ్ల దాటిన తర్వాత వెనుక వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో సుంకన్న తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించిక ఆయన మృతిచెందాడు. సుంకన్నకు భార్య హుసేనమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బాధిత కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు. దీంతో సాయంత్రం మృతదేహాన్ని తీసుకుని నేరుగా వజ్రకరూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న బాధిత కుటుంబసభ్యులు తమకు న్యాయం చేయాలంటూ ధర్నా చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. సీఐ చిన్నగౌస్, ఎస్‌ఐ నాగస్వామి తదితరులు బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. మృతుడి భార్య హుసేనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోద చేశారు.



ధర్నా చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

పీఏబీఆర్ కుడికాలువ కింద చెరువులన్నీ నింపాలి

- పండ్లతోటల రైతు సంఘం నాయకుల డిమాండ్

అనంతపురం సెంట్రల్: పీఏబీఆర్ కుడికాలువ కింద ఉన్న చెరువులన్నింటినీ తుంగభద్ర, కృష్ణా జలాలతో నింపాలని జిల్లా పండ్లతోటల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పీఏబీఆర్, జీడిపల్లి రిజర్వాయర్‌లను వారు పరిశీలించి, మాట్లాడారు. పీఏబీఆర్‌లో నీరు పుష్కలంగా ఉన్నా... చెరువులను నింపడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందన్నారు. అయితే చెరువులకు సరిపడ నీరు విడుదల చేయడం లేదన్నారు. చెరువులను 50 శాతం మాత్రమే నింపుతామని జల వనరులశాఖ అధికారులు చెబుతున్నారని, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పూర్తిగా నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పండ్ల తోటల రైతు సంఘం అధ్యక్షుడు అనంతరాముడు, ఉపాధ్యక్షులు నారపరెడ్డి, ఆనంద్, ముఖ్య కార్యదర్శి మురళీమోహన్ చౌదరి, నాయకులు రామాంజనేయులు, సంజీవరాయుడు, రవీంద్రనాయుడు, గిరి, గోవిందు, ప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



జీడిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న పండ్లతోటల రైతు సంఘం నాయకులు

సంతానం కలగలేదని వివాహిత ఆత్మహత్య

కళ్యాణదుర్గం రూరల్: సంతానం కలగలేదన్న బాధతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.... కళ్యాణదుర్గంలోని ఎర్రనేల వీధిలో ఖాదర్‌బాషా, రెహానాబీ (28)కి పదేళ్ల క్రితం వివాహమైంది. స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న రెహానాబీ... తనకు సంతానం కలగకపోవడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంది. అయినా ఫలితం లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు లోనైంది. ఇక తనకు పిల్లలు పుట్టరంటూ మానసికంగా కుంగిపోయిన ఆమె బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ వర్గీయులు దాడి



గాయపడిన లోకేష్

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలో నూతన సంవత్సర వేడుకల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ వర్గీయులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా బత్తలపల్లి కూడలిలో టీడీపీ వర్గీయులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకుంటున్నారు. అర్ధరాత్రి టీడీపీ వర్గీయులు కేక్ కట్ చేసి జై పరిటాల అంటూ నినాదాలు చేశారు. ఇదే సమయంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కేక్ కట్ చేసి జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఎరా మా ముందే జై జగన్ అంటూ నినాదాలు చేస్తారా అంటూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గవ్వల రమేష్, ముసుగు అప్పస్వామి, కొంకా ప్రసాద్‌లపై టీడీపీ వర్గీయులు దాడులకు పాల్పడ్డారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న లోకేష్‌నాయుడు ఇరువర్గాల వారికి సర్దిచెప్పేందుకు వెళ్లగా అతనిపైన దాడికి పాల్పడ్డారు. దీంతో వారు నలుగురు గాయపడ్డారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న ఎస్‌ఐ సోమశేఖర్ ఇరువర్గాల వారిని సర్దిచెప్పి పంపారు. బుధవారం ఉదయం స్టేషన్‌కు రండి అంటూ చెప్పి పంపాడు. బుధవారం వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కోటి సురేష్ బాధితులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా కేసు నమోదు చేసుకునేది లేదు, ఎవ్వరికి చెప్పకుంటారో చెప్పకోండి అంటూ సీఐ ప్రభాకర్ రెచ్చిపోయినట్లు బాధితులు తెలిపారు. న్యాయం చేయాల్సిన అధికారులే ఇష్టారాజ్యంగా దుర్భాలాడడం బాధకరమన్నారు. దీంతో తాము ఇచ్చే పిర్యాదు తీసుకోనందువల్ల ప్రవేట్ కేసు వేస్తామంటూ స్టేషన్ నుంచి వెనుదిరిగి వచ్చినట్లు బాధితులు తెలిపారు.

చెన్నంపల్లిలో వ్యక్తి హత్య



హతుడు ఆదినారాయణ

బుక్కరాయసముద్రం: మండలంలోని చెన్నంపల్లిలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు..... చెన్నంపల్లికి చెందిన ఆదినారాయణ (52), సులోచన దంపతులు కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మద్యానికి ఆదినారాయణ బానిసయ్యాడు. రోజూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని భార్యను వేధింపులకు గురి చేస్తూ, చితక బాదేవాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న ఆదినారాయణ... భార్య సులోచనతో గొడవపడి కొట్టాడు. అప్పటికే తండ్రి ప్రవర్తనపై విసుగు చెంది ఉన్న కుమారుడు నాగార్జున... పట్టరాని ఆవేశంతో చేతికి అందిన రోకలి బండతో ఆదినారాయణ తలపై బలంగా మోదడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమచారం అందుకున్న సీఐ కరుణాకర్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

కళ్యాణదుర్గం రూరల్: అప్పులు తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యాయత్నం చేసిన రైతు ఆస్పత్రిలో చికిత్సకు స్పందించక మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం దురదకుంట గ్రామానికి చెందిన సుంకన్న (54)కు భార్య లక్ష్మీదేవి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకొని పంటల సాగు చేపట్టాడు. పంట పెట్టుబడులకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పుల చేశాడు. ఈ క్రమంలో సాగు చేసిన టమాట, మొక్కజొన్న పంటల్లో ఆశించిన మేర దిగుబడులు అందక నష్టపోయాడు. దీంతో అప్పుల భారం రూ.10 లక్షకు పైగా చేరుకుంది. ఇటీవల వడ్డీ వ్యాపారుల వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో మనస్తాపం చెందిన సుంకన్న గత ఏడాది డిసెంబర్ 30న క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక బుధవారం సుంకన్న మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బానకచర్ల–గోదావరి ఎవరికోసం బాబూ?

- 700 కి.మీ నీటి తరలింపు సాధ్యమేనా?
- చంద్రబాబును ప్రశ్నించిన జలసాధన సమితి, రైతు సంఘం నాయకులు
- కృష్ణా జలాలను హంద్రీనీవాకు మళ్లించి సీమకు మేలు చేయాలని విన్నపం



సమావేశంలో మాట్లాడుతున్న జలసాధన సమితి, రైతు సంఘం నాయకులు

హిందూపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన గోదావరి– బానకచర్ల లింకు ప్రాజెక్టు ఎవరి ప్రయోజనాల కోసం తెరపైకి తెచ్చారో రాయలసీమ ప్రజలకు వివరించాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. రూ.80 వేల కోట్ల వ్యయంచేసి 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరి నుంచి రాయలసీమకు నీళ్లు ఇస్తానని చెప్పడం సీమ రైతులు, ప్రజలను మోసపుచ్చడమే అన్నారు. బుధవారం జలసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చైతన్య గంగిరెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కేవలం 40 టీఎంసీల నీటి కోసం రూ. 80 వేల కోట్లు వెచ్చించే ప్రాజెక్టును తెరపైకి తీసుకురావడం వెనక ఆంతర్యం ఏమిటో చెప్పాలన్నారు. దాని బదులు ఏటా కర్నూలు జిల్లాలోని కృష్ణానది నుంచి సముద్రంలో కలుస్తోన్న వందల టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించడానికి ఉన్న అవకాశాన్ని పరిశీలించాలన్నారు. నిజంగా రాయలసీమ వాసులకు మేలు చేయాలంటే హంద్రీనీవా, పోతిరెడ్డి పాడు ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు.

ఆ జీఓలు రద్దు చేయాలి..


గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హంద్రీనీవా ప్రాజెక్టు కాలువ వెడల్పు పనులకు రూ.6,182 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన ఆమోదం తెలిపారని, దీనివల్ల సీమకు ఎంతో ప్రయోజనాలు కలిగేవని జనసాధన సమితి నేతలు అన్నారు. తాజాగా సీఎం చంద్రబాబు ఆ జీఓను రద్దుచేసి రాయలసీమ ప్రయోజనాలను దెబ్బతీసేలా వ్యవహరించారన్నారు. అంతేకాకుండా హంద్రీనీవా ప్రాజెక్టుకు మాల్యాల నుంచి జీడిపల్లి వరకు వెడల్పు పనులు తగ్గించి కేవలం 3,850 క్యూసెక్కులకు పరిమితం చేసి కాలువకు లైనింగ్ చేయడానికి సీఎం చంద్రబాబు 404, 405 జీఓలు తెచ్చి రాయల సీమ ప్రజలు, రైతులను అన్యాయం చేస్తున్నారని వాపోయారు. దీనివల్ల అనంతపురం జిల్లాకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. చంద్రబాబు ఇచ్చిన జీఓలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాయల సీమ రైతులపై ఏ మాత్రం ప్రేమ ఉన్నా.. కర్నూలు జిల్లా మల్యాల నుంచి జీడిపల్లి వరకు 10 వేల క్యూసెక్కులు, జీడిపల్లి నుంచి కిందకు 6 వేల క్యూసెక్కులు తీసుకునేలా హంద్రీనీవా కాలువలను వెడల్పు చేసి తగిన రిజర్వాయర్లు నిర్మించేందుకు బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని జలసాధన సమితి నేతలు డిమాండ్ చేశారు. అంతేకాకుండా రెండేళ్లలో కాలువలు పూర్తి చేయాలన్నారు.

ఎంబీసీపై దృష్టి సారించాలి..

ప్రస్తుతం గొల్లపల్లి రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తోందని, ఆ నీటిని మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా చెరువులకు మళ్లించేందుకు అవసరమైన పనులకు రూ. 1.50 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదించారని, వెంటనే ఆ నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, పెనుగొండ నుంచి రాష్ట్ర కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి సవిత, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఎంబీసీపై ఒక్కసారి కూడా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని హంద్రీనీవా కాలువలో పూడికతీత పనులను పూర్తి చేయించి, చెరువులకు నీళ్లు మళ్లించాలన్నారు. అలాగే ఈ ప్రాంతానికి మేలు జరిగేలా విభజన చట్టం మేరకు వెనకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులను తీసుకు వచ్చి రాయలసీమ జిల్లాలను అభివృద్ధి చేయాలన్నారు. లేనిపక్షంలో పంజాబ్ రైతుల ఉద్యమ స్ఫూర్తితో జలసాధన సమితి ఆధ్వర్యంలో రాయలసీమ వ్యాప్తంగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసే వరకు రైతులు, ప్రజలు, విద్యార్థులతో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు సిద్దారెడ్డి, జలసాధన సమితి నాయకులు జమీల్, అమానుల్లా, ఉమర్ షారుఖ్, శ్రీరాములు, ఆదినారాయణ, నవీన్, తిప్పిస్వామి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

పురపాలకం.. దుర్గంధ భరితం

- పట్టణ, నగర ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్ల కరువు
- అత్యవసర పరిస్థితుల్లో గ్రామీణులకు తప్పని ఇబ్బందులు
- ప్రతిపాదనలకే పరిమితమైన సామూహిక మరుగుదొడ్లు
- ఆరుబయట మల, మూత్ర విసర్జనతో పెరిగిన అపరిశుభ్రత



కళ్యాణదుర్గం మున్సిపల్ కార్యాలయం

రాయదుర్గం: జిల్లాలోని అనంతపురం నగర కార్పొరేషన్ మొదలు గుంతకల్లు, తాడిపత్రి గ్రేడ్–1 రాయదుర్గం గ్రేడ్–2, కళ్యాణదుర్గం గ్రేడ్–3 పురపాలక సంఘాలు, ఉరవకొండ, శింగనమల నియోజకవర్గాల్లో జనాభాకు తగినట్లుగా శౌచాలయాలు లేవు. నగరంతో పాటు పట్టణ ప్రాంతాలకు రోజూ వ్యక్తిగత పనులపై వేల సంఖ్యలో ప్రజలు వచ్చి వెళుతుంటారు. వివిధ పనుల కోసం గ్రామీణ ప్రాంతాల నుంచే కాకుండా వ్యాపార నిమిత్తం ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. వీరు అత్యవసర పరిస్థితుల్లో కాలకృత్యాలు తీర్చుకునేందుకు నానా తంటాలు పడక తప్పడం లేదు. ప్రతి వెయ్యి మందికి ఓ మరుగుదొడ్డి నిర్మించాలన్నది పాలకుల ప్రతిపాదన అయితే ఆ దిశగా క్షేత్రస్థాయి కార్యచరణ కనిపించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా మహిళలు, వృద్ధులు, యువతులు ఈ సమస్యను గట్టెక్కేందుకు పడే అవస్థలు వర్ణణాతీతం. గ్రేడ్–1 మున్సిపాల్టీలు, అనంతపురం నగర కార్పరేషన్‌లోనూ అక్కడక్కడ మాత్రమే శౌచలయాలు కనిపిస్తున్నాయి. ప్రైవేట్ శౌచలయాల్లో శుభ్రత చర్యలు చేపట్టక పోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో చాలా మంది ఆరుబయలు ఖాళీ స్థలాల్లోనే అత్యవసరాలు తీర్చుకుంటున్నారు. గుడి, బడి, పబ్లిక్ ప్రదేశాలు అనే తేడా లేకుండా ఆయా ప్రాంతాలు మలినాలతో దుర్గంధభరితమవుతున్నాయి.

ప్రతిపాదనలకే పరిమితం

జిల్లాలోని మున్సిపాల్టీలు, నగర పాలక సంస్థ, ఇతర పట్టణాల పరిధిలో ప్రజా అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరులో నిర్లక్ష్యం నెలకొంది. కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. షుగర్ బాధితుల ఇబ్బందులైతే వర్ణనాతీతం.ఆరుబయలులో మల, మూత్ర విసర్జన పెరిగితే పలు రకాల వ్యాధులు విస్తరించే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

క్లుప్తంగా

టీఎల్ఎమ్ బోధనతో సత్ఫలితాలు



మాట్లాడుతున్న కేఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు టీఎల్ఎమ్ (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) ద్వారా బోధించడం ద్వారా సత్ఫలితాలు వస్తాయని కేఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ పేర్కొన్నారు. జాబ్ ట్రైనింగ్ కోర్సులో భాగంగా కేఎస్ఆర్ కళాశాల విద్యార్థినులు నగరంలో బరమప్ప వీధి అంగన్‌వాడీ కేంద్రంలో 30 రోజుల పాటు శిక్షణ తీసుకున్నారు. వీరు టీఎల్ఎమ్‌తో చిన్నారులకు బోధించినట్లు తెలిపారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన కల్పించేందుకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ భారతి, కళాశాల లెక్చరర్స్ విజయ భారతి, వసంత, గౌరి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి హస్తకళల ప్రదర్శన

అనంతపురం కల్చరల్: హస్తకళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా లేపాక్షి ఎంపోరియంలో ఐదు రోజుల పాటూ హస్తకళల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం నగరంలోని లేపాక్షి ఎంపోరియంలో జరిగిన సమావేశంలో ఎంపోరియం మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడారు. సంప్రదాయ చేనేత వస్తువుల అమ్మకాలు ప్రదర్శన, మన సంస్కృతిని చాటే కళా ఉత్పత్తులను డిస్కౌంట్ ధరలకే విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు అనంత వేదికగా అద్భుత నైపుణ్యంతో సాగే ప్రదర్శనలో కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లెదర్ పప్పెట్స్, కలంకారి, ఎంబ్రాయిడరీ వస్తువులు ఎంతో కళాత్మకంగా ఉంటాయన్నారు. హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శనను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపోరియం సిబ్బంది అమరనాథ్, సురేష్, నాగార్జున, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

అనంతపురం కల్చరల్: నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు వారి ఆధ్వర్యంలో బుధవారం దుస్తుల పంపిణీ చేశారు. స్థానిక ఎయిమ్ ఫర్ సేవ ఆశ్రమంలో ట్రస్టు వ్యవస్థాపకురాలు డాక్టర్ నిర్మల నేతృత్వంలో విద్యార్థులకు వస్త్రాలు, బియ్యం బస్తా, నిత్యావసర వస్తువులు అందజేశారు. అలాగే అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సరైన లక్ష్యం ఏర్పరచుకుని ఉన్నత జీవితంలో స్థిరపడాలని సూచించారు. స్ఫూర్తిదాయక వ్యక్తుల విలక్షణ జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రుద్రేశ్వర్, విష్ణు పాల్గొన్నారు.

కోతలే.. కోతలు!



మామిళ్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్

- అనధికార విద్యుత్ కోతలతో ఇక్కట్లు
- ఆందోళనలో అన్నదాతలు
- విద్యుత్ సబ్ స్టేషన్లలో సమస్యల తిష్ట
- పట్టించుకోని ఉన్నతాధికారులు



విద్యుత్ కోతలు నివారించాలని మామిళ్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న రైతులు (ఫైల్)

కనగానపల్లి: వేసవికాలం ప్రారంభం కాకనే గ్రామాల్లో కరెంట్ కోతలు మొదలయ్యాయి. గ్రామాల్లో పగటి పూటతో పాటు రాత్రి వేళల్లో కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటోంది. రైతులతో పాటు గృహ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలో మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటిలో మామిళ్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ అనధికార కోతలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో మూడు ఫీడర్ల కింద సుమారు 15 గ్రామాలు ఉన్నాయి. జాతీయ రహదారి పక్కన కొన్ని పరిశ్రమలు కూడా ఉన్నాయి. ఈ విద్యుత్ కోతల వల్ల రబీలో బోరుబావుల కింద పంటలు సాగు చేసిన రైతులు, పరిశ్రమల యజమానులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ కోతలను నివారించాలని కోరుతూ ఇటీవల చుట్టు పక్కల గ్రామాల్లోని రైతులు, ప్రజలు పలుమార్లు సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి ధర్నా కూడా నిర్వహించారు.

మామిళ్లపల్లిలో సబ్ స్టేషన్‌లో అధికం..

మామిళ్లపల్లిలో ఉన్న 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు స్థానికులు చెపుతున్నారు. ఈ సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు ఫీడర్ల సిప్పు బ్రేకర్లు సరిగా పని చేయడం లేదు. దీంతో 24 గంటల విద్యుత్ సర్వీసులు ఉన్న వారితో పాటు గృహ వినియోగదారులకు కూడా విద్యుత్ కోతలు వస్తున్నాయి. ఇక సబ్‌స్టేషన్ కింద ఉన్న కుఱుతురు ఫీడర్ కింద గ్రామాలు ఎక్కువగా ఉండటంతో విద్యుత్ ఓవర్ లోడుతో సమస్యలు తలెత్తున్నాయని స్థానిక గ్రామాల రైతులు, సిబ్బంది చెబుతున్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో చాలాచోట్ల విద్యుత్‌లైన్లు పాడై మరమ్మతులకు గురతుండటంతో సిబ్బంది ప్రతిసారి ఎల్‌సీలు తీసుకుటున్నారు. దీనివల్ల పరిశ్రమలతో పాటు గృహ వినియోగదారులకు విద్యుత్ కోతలు విధిస్తున్నారు.

గ్రామాల్లో సిబ్బంది కొరత

మండలంలోని విద్యుత్‌శాఖ కింద పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. ముఖ్యంగా గత సంవత్సర కాలం నుంచి మండలానికి విద్యుత్‌శాఖ ఏఈ కూడా లేకపోవటంతో చెన్నేకొత్తపల్లి మండలం ఏఈని ఇక్కడ ఇన్‌చార్జ్‌గా పెట్టారు. ఇక మండలంలో ఒక ఎల్‌ఐ మాత్రమే ఉండటంతో పాటు చాలాచోట్ల లైన్ మెన్లు, హెల్పర్లు లేరు. మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 15 గ్రామాలకు కలపి ఇద్దరు జేఎల్ఎంలు, ఒక పోల్‌వర్కర్ మాత్రమే ఉన్నారు. దీంతో విద్యుత్‌లైన్లలో సమస్యలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించేవారు లేక గంటల కొద్ది విద్యుత్ కోతలు విధిస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

24 గంటల సరఫరాలో కోతలు

రైస్‌మిల్ నిర్వహణ కోసం ప్రభుత్వానికి రూ.లక్షల చెల్లించి 24 గంటల విద్యుత్ సరఫరా తీసుకొన్నాం. కాని రోజుకు నాలుగైదు మార్లు కరెంట్ కోతలు వస్తుండటంతో సీజన్‌లో రైస్‌మిల్ నిర్వహణ కష్టంగా ఉంది. ప్రతి నెలా మాలాంటి పరిశ్రమల వారితో రూ. వేలకు వేలు కరెంట్ బిల్లులు కటించుకొంటున్నారు. కాని స్థానిక సబ్‌స్టేషన్‌లో ఫీడర్ బ్రేకర్లు సరిగా ఏర్పాటు చేయకుండా కరెంట్‌కోతలు విధిస్తున్నారు. దీనివల్ల పరిశ్రమలు నడపటం చాలా నష్టం మారుతోంది. కావున అధికారులు స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలి.
– కె.రామలింగారెడ్డి, వెంకటేశ్వర రైస్‌మిల్ యజమాని, మామిళ్లపల్లి

పంటల సాగుకు ఇబ్బంది

విద్యుత్ కోతలతో రబీలో పంటల సాగు ఇబ్బందిగా మారింది. మామిళ్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చంద్రశ్చర్ల ఫీడర్ కింద విద్యుత్‌లైన్లు కూడా సరిగా లేవు. దీంతో ప్రతిసారి లైన్లు కట్ అవుతున్నాయి. విద్యుత్ సిబ్బంది కొరతతో తిరిగి వాటిని మరమ్మత్తు చేయటానికి చాలా సమయం పడుతోంది. అధికారులు సిబ్బందిని నియమించి విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలి.
– నారాయణ, రైతు, చంద్రాచ్చర్ల

సమస్యలు పరిష్కరిస్తాం

స్థానిక సబ్‌స్టేషన్లలో ఉన్న కొన్ని సమస్యల వల్ల గ్రామాల్లో విద్యుత్ కోతలు వస్తున్నాయి. వీటితో పాటు కనగానపల్లి మండలంలో విద్యుత్ సిబ్బంది కొరత కూడా ఉంది. వీటిపై ఉన్నతాధికారులకు నివేదించి విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం
– లక్ష్మీనారాయణ, విద్యుత్‌శాఖ ఏడీ, చెన్నేకొత్తపల్లి సబ్ డివిజన్

యూటీఎఫ్ నాయకులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భవించి 50 ఏళ్ల పూర్తి కావడంతో గతంలో జిల్లా నాయకులుగా పని చేసిన వారిని బుధవారం సన్మానించారు. స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం పూర్వ నాయకులు మాట్లాడారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలపై అనేక ఉద్యమాలు చేశామని గుర్తు చేశారు. అప్రెంటీస్ రద్దు, పీఆర్సీ సాధన అంశాల్లో యూటీఎఫ్ అనేక సమరశీల పోరాటాలు చేసిందన్నారు. ప్రస్తుత నాయకులు మాట్లాడుతూ.. సంఘానికి విశిష్ట సేవలందించిన పూర్వపు నాయకులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. గత నాయకుల స్ఫూర్తితో సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. అనంతరం యూటీఎఫ్ పూర్వపు నాయకులు ఇమామ్ సాహెబ్, టి.ఈశ్వరయ్య, రామచంద్రారెడ్డి, సాయినాథ్‌బాబు, నాగేంద్రబాబు, ఓబులేసు, రామకృష్ణ, సి.ఈశ్వరయ్య, భాస్కర్, వేణుగోపాల్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, నాయకులు రమణయ్య, రామప్ప, సరళ, ప్రమీల, సుబ్బరాయుడు, దేవేంద్రమ్మ, చంద్రమోహన్, జిలాన్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఆర్ఎంఓగా డాక్టర్ రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంఓ)గా డాక్టర్ సీహెచ్ రామకృష్ణ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. అంతకుమందు ఆయన సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావును మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఆర్ఎంఓకు డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్లు రజిని, నాగమణి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా కల్పతరు మహోత్సవం



విద్యుద్దీప కాంతుల్లో బాలయేసు ప్రార్థనా మందిరం

అనంతపురం కల్చరల్: భవితపై కోటి ఆశల పెట్టుకుని 2025 సంవత్సరానికి అనంత వాసులు ఆనందోత్సాహాలతో స్వాగతం పలికారు. బుధవారం పలు చోట్ల శుభాకాంక్షలు, సాంస్కృతిక సంబరాలు అంబరాన్నంటాయి. నగర వీధుల్లో విద్యార్థులు, యువకులు సందడి చేశారు. రామనగర్, ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పలు చర్చిల్లో సామూహిక ప్రార్థనలు, అన్నదానాలు జరిగాయి. బ్రహ్మకుమారీలు సిస్టర్ శారద ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ముతవల్లి కేఎం షఫీవుల్లాను పలువురు మత పెద్దలు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కళాకారుల కాలనీలోని రేమా చర్చిలో పాస్టర్ మనుష్యే ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు సేవా కార్యక్రమాలు జరిగాయి. అదేవిధంగా నగర శివారులోని బాలయేసు ప్రార్థనా మందిరాన్ని విద్యుద్దీప కాంతులతో సుందరంగా అలంకరించి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ రవీంద్ర బాలచౌరి వాక్యోపదేశం చేశారు. అలాగే నగరంలోని రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు ప్రత్యేక సమావేశంలో కల్పతరు మహోత్సవం జరుపుకున్నారు. నిర్వాహకుడు శ్రీధరమూర్తి నేతృత్వంలో సద్గురువులు రామకృష్ణ పరమహంస చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప గ్రామోత్సవం



వెండి రథంలో కొలువుదీరిన అయ్యప్ప స్వామి



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు: మండల కేంద్రంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంలో కొలువుదీర్చారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన వెండి రథం ముందు మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులు పట్టారు. అదే విధంగా అయ్యప్ప స్వామి మాలధారులు భక్తిగీతాలు ఆలపిస్తూ సందడి చేశారు.

పాపంపేటలో..

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో బుధవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప మాలధారుడు వడ్డే మురళి నివాసం వద్ద గురుస్వామి నాగరాజు ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. స్వామివారి 18 మెట్లను వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప శరణఘోషతో మార్మోగింది. అనంతరం వివిధ భక్తిగీతాలు ఆలపించారు. సమీప ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధారులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

నూతన సంవత్సర సందడి




పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంతకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, శైలజానాథ్



మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి పూలమాల వేస్తున్న నాయకులు

రాప్తాడు రూరల్/రాప్తాడు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం నగర శివారులోని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నివాసం వద్ద సందడి సందడి వాతావరణం నెలకొంది. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలి వచ్చి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి పూల బొకేలు అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి, చంద్రశేకర్ రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గంగుల భానుమతి, పెనుకొండ పొగాకు రామచంద్ర, గంగుల సుధీర్‌రెడ్డి, అనంతపురం రూరల్ ఎంపీపీ, జెడ్పీటీసీలు వరలక్ష్మి, చంద్రకుమార్, ఆత్మకూరు ఎంపీపీ హేమలత, రాప్తాడు ఎంపీపీ, జెడ్పీటీసీలు జయలక్ష్మి, హేమావతి, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, చెన్నేకొత్తపల్లి ఎంపీపీ, జెడ్పీటీసీలు అంజలి, గోవిందరెడ్డి, కనగానపల్లి ఎంపీపీ, జెడ్పీటీసీలు మారుతీ, భాగ్యలక్ష్మి, రామగిరి జెడ్పీటీసీ నాగార్జున, నాయకులు గోవిందరెడ్డి, బండి పవన్, గోపాల్ రెడ్డి, మాదన్న, డాక్టర్ శీనా, సత్తిరెడ్డి, జూటూరు శేఖర్, ఆత్మకూరు చంద్రశేఖర్ రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

గోరంట్ల మాధవ్ ఇంటి వద్ద..

రాప్తాడు రూరల్/రాప్తాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఇంటి వద్ద బుధవారం నూతన సంవత్సర సంబరాలు జరుపుకున్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. సతీమణితో కలిసి గోరంట్ల మాధవ్ కేక్ కట్ చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పూల బొకేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, రాప్తాడు జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, నాయకులు గంగుల భానుమతి, మహానంద రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ననసకోట కురుబ ముత్యాలు, బోయ రాజారాం, చియ్యేడు గంగాధర్‌రెడ్డి, ధనుంజయ యాదవ్, పూలకుంట శివారెడ్డి, సత్యనారాయణరెడ్డి, కుంటిమద్ది రమేష్, ఓబిరెడ్డి, చిత్రా వెంకటేష్, ఆది, కురుబ శివబాల, కేసీ మల్లికార్జున, తాటిచెర్ల అమర్‌నాథ్‌రెడ్డి, మోహన్‌బాబు పాల్గొన్నారు.

రమేష్ గౌడ్ నివాసంలో..

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు బీసీ రమేష్‌గౌడ్ తన నివాసంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, వివిధ కుల ప్రజా సంఘాల నేతలు, అభిమానులు రమేష్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, భారీ గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు తీసుకురావాలన్నారు. వైఎస్సార్‌సీపీ, ముస్లిం మత పెద్దలు ప్రజా, కుల సంఘాల నాయకులు భాస్కర్‌బాబు, విష్ణువర్ధన్, రాఘవ, రామ్మోహన్ గౌడ్, నరేంద్ర, గణ, ఆదినారాయణ, భాస్కర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హేమ కిరణ్, తేజ, రఘురామయ్య, నగేష్, బూసీ, శ్యామల, శ్రీదేవి, కృష్ణవేణి, గంగావతి, పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్: మేయర్ వసీం నివాసంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. కమిషనర్ రామలింగేశ్వర్ మేయర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఎస్ఈ ఈఈలు రాధాకృష్ణ, షాకీర్, డీఈ దాక్షాయని, కార్పొరేటర్లు రాజేశ్వరి, కమల్ భూషణ్, సైఫుల్లాబేగ్, రహంతుల్లా పాల్గొన్నారు.



నాయకులతో కలసి కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్



మేయర్ వసీంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు



మాజీ మేయర్ రాగే పరుశురాంకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు



మాజీ ఎమ్మెల్సీ వెన్నపూస గోపాలరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు



కేక్ కట్ చేస్తున్న పార్టీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్ గౌడ్



డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

'విద్యను నిర్వీర్యం చేసేందుకు కుట్ర'

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంగ్లిష్ సంవత్సరం సాక్షిగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ఇంగ్లిష్ మీడియంకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలకబోతోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని విద్యా విధానం ప్రపంచంతో పోటీ పడాలనే సంకల్పంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకంలో భాగంగా అనేక వసతులు కల్పించారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. పోటీలో నిలబడాలంటే ఇంగ్లిష్ మీడియం తప్పనిసరి అని భావించి ఇంగ్లిష్ మీడియం అమలుకు శ్రీకారం చుట్టారన్నారు. ఐబీ సిలబస్, ఇంగ్లిష్ డిక్షనరీలు, ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీల ద్వారా బోధన జరిగేలా చూశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా అడుగులు వేస్తోందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ మీడియం అనేది తప్పనిసరి అన్నారు. కేవలం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీద కక్షతో ఇంగ్లిష్ మీడియంకు మంగళం పాడాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో 95 శాతం మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇంగ్లిష్ మీడియంను కోరుకుంటున్నారని గుర్తు చేశారు. పేద విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

అనంతపురం కల్చరల్: నగరంలోని డ్యాన్స్ మాస్టర్లు తమ శిష్యబృందాలతో కలిసి కొత్త సంవత్సరాన్ని ఆనందోత్సాహాల నడుమ ఆహ్వానించారు. ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా బుధవారం సాయంత్రం స్థానిక లలిత కళాపరిషత్తులో పలు వినోద కార్యక్రమాలు జరిగాయి. ఎల్కేపీ కార్యదర్శి పద్మజ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీకాంత్, వన్నూరు మాస్టర్, హరిప్రసాద్, విష్ణు, చందు, కుళ్లాయ్, అర్జున్, విజయ్ తదితర డ్యాన్స్ మాస్టర్లు చిన్నారులతో కలిసి స్టెప్పులేసి అలరించారు. డీజే శబ్దాలతో సినీ, జానపద గీతాలకు అద్భుతంగా డ్యాన్స్ చేశారు. డీఎస్పీ గురునాథ్ మాట్లాడుతూ.. చిన్నారులను చదువుతో పాటూ కళల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం రంగస్థల కళాకారులు, ఎల్కేపీ కార్యవర్గ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి ఆనందాలను పంచుకున్నారు.